కొత్త ఓటర్లు 2,534 మంది

- కుత్బుల్లాపూర్‌లో మొత్తం 7,34,051 మంది ఓటర్లు
- రాష్ట్రంలో ఓటర్ల సంఖ్యలో టాప్
- నేడు రాజకీయ పార్టీలకు కొత్త ఓటర్ల ముసాయిదా లిస్ట్



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఓటరు జాబితా

కుత్బుల్లాపూర్: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు తుది జాబితా సంబంధించిన ఓటర్ లిస్ట్‌ను ఈనెల ఆరవ తేదీన అందజేసేందుకు ఏర్పాటు చేశారు. 2024 నవంబర్ 28వ తేదీ నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు గడువు విధించి జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారితోపాటు, ఇటీవల విడుదల చేసిన అసెంబ్లీ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు సైతం ఫామ్ నెంబర్- 6 పూరించి ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఇందుకుగాను మండల రెవెన్యూ కార్యాలయంతో పాటు కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో దరఖాస్తులకు అవకాశం కల్పించగా కొత్తగా 2534 మంది జాబితాలో చేరారు.

రోజురోజుకూ పెరుగుతున్న ఓటర్లు....

తాజాగా 2534 మంది కొత్త ఓటర్లు ఎన్నికల అధికారులు కొత్త ఓటర్ల నమోదుకు ఆదేశాలు జారీ చేయగానే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రోజురోజుకూ ఓటర్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. నవంబర్ 29న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 7,31,517 మంది ఓటర్లు ఉండగా, తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం 7,34,051కి చేరింది. దీంతో 2534 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లుగా నమోదైన కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో పోలింగ్ స్టేషన్లవారీగా క్షేత్రస్థాయిలో పోలింగ్ అధికారులు పరిశీలిస్తే సుమారు రెండు లక్షలకు పైగా ఓటర్లు ఓటు హక్కు ఇక్కడ ఉన్న స్థానికంగా వారు లేకపోవడం విశేషం. ఈ విషయంపై ఎన్నికల అధికారులను వివరణ కోరగా వారు వచ్చి అడిగితే తప్ప తొలగించమని సమాధానం ఇస్తున్నారు. ఈ నెల ఆరవ తేదీన విడుదల చేసే తుదిఓటరు జాబితా ప్రకారం పురుషులు 3,82,611, స్త్రీలు 3,51,274 ఇతరులు 166 మంది ఉన్నట్లు తెలుస్తుంది.

మిషన్ భగీరథతో చెరువులకు పునరుజ్జీవం



అల్లం చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మిషన్ భగీరథతో చెరువులకు పునరుజ్జీవం ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లో రూ.40 లక్షలతో చేపట్టిన అల్లం చెరువు సుందరీకరణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షతకు గురైన తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీతను బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. కాలనీ వాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు మిషన్ కాకతీయ పథకంలో భాగంగానే అల్లం చెరువు సుందరీకరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నాయకులు సంపత్ మాధవ రెడ్డి, కుంట సిద్ధిరాములు, వార్డు సభ్యురాలు పద్మ, కాలే నాగేష్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, అనిల్, కాలే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

వీరశైవ లింగాయత్ జగద్గిరిగుట్ట విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, జగద్గిరిగుట్ట శ్రీవేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు నరసింహ ముదిరాజ్, బస్వేశ్వర్, వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు మల్లికార్జున్, గౌరవాధ్యక్షులు శంకర్, సలహాదారులు బోడపల్లి వీరశెట్టి, సంగమేశ్వర్, ఉపాధ్యక్షులు బస్వరాజ్, రాచన్న, ప్రధాన కార్యదర్శి ఎమ్మాడి వీరేశం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న వీర శైవ లింగాయత్ సంఘం సభ్యులు

మార్షల్స్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

కుత్బుల్లాపూర్: మార్షల్స్ ఆర్ట్స్‌లో ఆత్మరక్షణతో పాటు శరీర దారుఢ్యం పెంపొందుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్, మహబూబ్, శంకర్ మాస్టర్ల ఆధ్వర్యంలో ఆల్ ఇండియా మోడోతోవ నేషనల్ లెవ్ కుంగ్‌ఫూ కరాటే పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన మెడల్స్ ప్రదానోత్సవ కార్యక్రమానికి హన్మంతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు మార్షల్స్ ఆర్ట్స్, క్రీడలపై దృష్టి సారించాలని, జాతీయ స్థాయిలో కుత్బుల్లాపూర్‌కు పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సోమన్నగారి శ్రీధర్‌రెడ్డి, హరికిరణ్, కరణ్, సిద్దినోళ్ల సంజీవరెడ్డి, పద్మారావు ఉన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమియే గెలుపునకు నాంది అని బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామంలో ఆదివారం హనుమాన్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3 ఫైనల్స్ జరిగాయి. బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బాలప్ప, యశ్వంత్, చక్రి, వేముల రమేష్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నా కొడుకు కనిపించాడా!

కుమారుడి కోసం తల్లిదండ్రుల గాలింపు

నిజాంపేట్: తన కుమారుడి ఆచూకీ కోసం కనిపించిన ప్రతి ఒక్కరిని అడుగుతూ నగరం చుట్టూ బస్తీలు, కాలనీల్లో కొడుకు ఫొటో పట్టుకుని డిసెంబర్ 3 నుంచి తిరుగుతున్న ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన ప్రతి ఒక్కరిని కలిచి వేస్తోంది.



పి. సతీష్

ఆంధ్రప్రదేశ్‌లోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం, ఎండగండికి గ్రామానికి చెందిన దాసిగంగా– సత్యానారాయణ దంపతులు ప్రగతినగర్‌లోని ఎలీఫ్ పారిశ్రామిక వాడలో ఓ చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.వీరి కుమారుడు సతీష్(24) మందబుద్ధితో ఉన్నాడు.స్వగ్రామానికి వెళ్లిన సతీష్‌ను డిసెంబర్ 2న స్వగ్రామం నుంచి అక్కడున్న కుటుంబ సభ్యుల సహాయంతో రమణ ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. డిసెంబర్ 3న ఉదయం కుమారుడిని తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు జేఎన్‌టీయూ వద్ద వేచి ఉన్నారు. అయితే అప్పటికే జేఎన్‌టీయూ వెళ్లిపోయింది. లింగంపల్లిలో సతీష్‌ను దింపినట్లు బస్సు డ్రైవర్ తెలిపాడు. హుటాహుటిన లింగంపల్లికి వెళ్లగా సతీష్ అక్కడా లేడు. ఎంతకీ ఆచూకీ లేకపోవడంతో రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక అప్పటి నుంచి కుమారుడి ఫొటో పట్టుకుని లింగంపల్లి పరిసరాలతో పాటు కూకట్‌పల్లి, పటాన్ చెరు, బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌తో పాటు నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పబ్లిక్ పార్కుల్లో కనిపించిన ప్రతి ఒక్కరితో ఆరా తీస్తున్నారు.



ఓ పార్కులో కుమారుడి ఆచూకీ అడుగుతున్న గంగ

సమస్యల పరిష్కారానికి కృషి



కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ మహదేవపురం ఫేస్–2 రాయల్ హిల్స్ కాలనీ, ఇంద్రసింగ్ కాలనీ వాసులు ఆదివారం శ్రీశైలంగౌడ్‌ను కలిసి స్థానిక సమస్యలపై విన్నవించారు. ఇంద్రసింగ్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ లైన్‌లు, రాయల్ హిల్స్ కాలనీలోని గణేష్ టెంపుల్ నుండి సిక్కు బస్తీ వరకు సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీనిపై స్పందించిన శ్రీశైలంగౌడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి, రాయల్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణం రాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు,ఇంద్రసింగ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణంగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ఘట్‌కేసర్: జనాభా దమాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్ ఆధ్యక్షతన ఘట్‌కేసర్‌లో ఆదివారం నిర్వహించిన మాదిగ విద్యార్థి .యువగర్జన సన్నాహాక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, ఆయనకు మద్దతుగా ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి యువగర్జన సభను నిర్వహిస్తున్నామన్నారు. కులస్తులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాజీవ్ గృహకల్పకు బస్సు ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి బస్సు సర్వీసును కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ, మేడ్చ ల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సహకారంతో బస్సు సౌకర్యం కలిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం నాలుగు ట్రిప్పులు, సాయంత్రం మరో నాలుగు ట్రి ప్పులు కాలనీకి బస్సు వస్తుందన్నారు. పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగుల బలరాం, దేవేందర్, వెంకటేశ్, చలపతి, రాజేందర్, జాఫర్ హుస్సేన్, రాజేందర్ నాయక్, ఐలయ్య, పద్మావతి, రేణుక, బద్రు నాయక్, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం వద్దంటూ ధర్నా



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలో పారడైస్ ఫంక్షన్ హాల్ వెనకాల నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపేయాలని స్థానికులు ఆదివారం ధర్నాకు దిగారు. కాలనీవాసులు పిల్లలతో సహా హెచ్ఏఎల్ కాలనీ కమాన్ దగ్గర రాస్తారోకో నిర్వహించడంతో సుమారు రెండు కిలో మీటర్ల వరకు ట్రాఫిక్ జామైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సదరు స్థలం యజమాని, కాలనీవాసులను సోమవారం పోలీస్ స్టేషన్‌కు రావాలని, అప్పటి వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దని ఆదేశించడంతో స్థానికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ధర్నాలో మూర్తి, ఆంజనేయులు కమలాకర్, శ్రీనివాస్ రావు, రామ్మోహన్, పరిష శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్లు దోహదం



స్మార్ట్ సిటీ నమూనాతో విద్యార్థులు



నమూనాను వివరిస్తున్న విద్యార్థులు

రంగారెడ్డినగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయని ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంజుపాండే అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ మారుతీ నగర్‌లోని స్కూల్‌లో స్టెమ్ ఎక్స్‌పో పేరిట సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు సైన్స్, గణిత, రోబోటిక్స్ తదితర సాంకేతికపరమైన నమూనాలను ప్రదర్శించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఎగ్జిబిషన్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై వాటి నమూనాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గణేష్‌నగర్ ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ హెచ్ఎం ఇందిర, ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ధనరాజ్ యాదవ్

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పిక్సెల్ ఐ హాస్పిటల్, 191 ఎన్‌టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 191 ఎన్‌టీఆర్ నగర్ గ్రౌండ్ దగ్గర ఆదివారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ కార్పొరేటర్ బాలాజీ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత కంటి పరీక్షల శిబిరాలను స్థానికుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంజునాథ్, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్, రాజేష్, పూర్ణ, ప్రేమ్, మధు, మల్లారెడ్డి, నర్సింహా, బేతపూడి రాజు, మోహన్, రామ్ పర్వేష్, ప్రదీప్ నాయక్ పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీ



విజేతకు బహుమతి అందజేస్తున్న కాలనీ పెద్దలు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఎస్.ఆర్.నాయక్ నగర్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కాలనీపెద్దలు సత్యనారాయణ, మల్లికార్జున్ రావు, సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎం.ఎన్.రెడ్డినగర్ ఫేస్– 1లో..

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డినగర్ ఫేస్– 1లో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంపత్‌గౌడ్, నర్సింహారెడ్డి, పరమేశ్వర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, విజయ్, ప్రతాప్ రెడ్డి, భిక్షపతి గౌడ్, బాపిరెడ్డి పాల్గొన్నారు.

బాచుపల్లిలో..

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని కాసాని కౌసల్య ఫామ్ హౌస్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్, 21వ డివిజన్ కార్పొరేటర్ కాసానీ శిరీష వీరేష్ ముదిరాజ్, కాకతీయ కమ్మ సంఘం చైర్మన్ గూడూరి సత్యనారాయణ, వారణాసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న 'లక్ష డప్పులు..వెయ్యి గొంతులు'



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఏపూరి సోమన్న, అశోక్ తదితరులు

జవహర్‌నగర్: ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు..వెయ్యి గొంతుల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 30 ఏళ్ల మందకృష్ణ మాదిగ పోరాటం, ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఎలిగెత్తి చూపుదామని.. వర్గీకరణకు అడ్డం వచ్చేవాళ్లకు అర్థమైతలేదా అంటూ పాట రూపంలో కళాకారుడు వెంకటచారి చూపించిన సీడీని జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్వై.అశోక్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాంచందర్, కొయ్యడ వెంకటేశ్, సదానందం, కూటి శ్రీనివాస్, పరశురాం, యాకస్వామి, నరేశ్, ప్రకాశ్, యాదయ్య, విజయ, శంకర్, కొమురయ్య, ప్రజా సంఘాల నాయకులు, క్రాంతి కళా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చింతల్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ వల్ల సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ భిక్షపతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు: ఐడీపీఎల్ సబ్ స్టేషన్ సిస్కో ఫీడర్ పరిధిలోని బాలనగర్, సిస్కో, గోల్డెన్ ఫుడ్ టెక్నాలజీ, భారతీ కెమికల్స్, కుమార్ రబ్బర్స్, సూరాన ఇండస్ట్రీస్, బోయిన్‌పల్లి సబ్ స్టేషన్ గౌతమ్ నగర్ ఫీడర్ పరిధిలోని గౌతమ్ నగర్, ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్, గౌతమ్ నగర్, ఎన్ఎస్‌కేకే స్కూల్, శ్రీసాయినాథ్ నగర్, మహాత్మా నగర్, నాగార్జున కాలనీ తదితర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీపీఎల్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్‌వీసీఐఈ, సాక్షి ప్రింటింగ్ ప్రెస్, ఏపీ టెక్ టవర్స్, హోమ్ స్టీల్స్, అగర్వాల్ స్టీల్, మెగా ఇంజనీరింగ్, బోయిన్‌పల్లి సబ్ స్టేషన్ అక్షయ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో వెజిటేబుల్ మార్కెట్ ఏరియా, అక్షయ ఎన్‌క్లేవ్, ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, ఫతేనగర్, కట్ట మైసమ్మ టెంపుల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

- **సుభాష్‌నగర్:** విద్యుత్ మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ నుంచి శంషీగూడ సబ్‌స్టేషన్ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు మహదేవపురం, బాలయ్య బస్తీ, షిర్డీ హిల్స్, కైలాస్‌హిల్స్, ఐశ్వర్య ఎస్టేట్, ప్రాగా టూల్స్, నందిని హిల్స్, మహదేవపురం వార్డు కార్యాలయం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కార్యకర్తకు పరామర్శ

కుత్బుల్లాపూర్: కార్యకర్తల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సుభాష్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త దాత్రిక శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం గౌడ్ ఆదివారం ఆయనను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుబ్బల రమణ, బొబ్బా ప్రసాద్, మల్లేష్ గౌడ్, పాటిల్, రంగనాథ్, చక్రి, నర్సింగరావు, మోహన్ రావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఎల్ ఎన్‌క్లేవ్(సౌత్) అధ్యక్షుడిగా ఎంఆర్ఎస్ రాజు



అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, సెక్రటరీ టీవీ ప్రసాద్ తదితరులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎన్‌సీఎల్ ఎన్‌క్లేవ్(సౌత్) నూతన అసోసియేషన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.ఆర్.ఎస్.రాజు, ఉపాధ్యక్షుడిగా సాంబశివరాజు, సెక్రటరీగా టీవీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా సాయిబాబా, కోశాధికారిగా వేణుమాధవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎంఆర్ఎస్ రాజు మాట్లాడుతూ.. కాలనీ వాసుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని, మిగతా కార్యవర్గ సభ్యులను త్వరలోనే నియమిస్తామని తెలిపారు.

రసాయనాల ట్యాంకర్ స్వాధీనం



పోలీసులు పట్టుకున్న ట్యాంకర్

దుండిగల్: వ్యర్థ రసాయన ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న ఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గండిమైసమ్మ ప్రాంతంలోని ఓ పార్కింగ్ స్థలంలో రసాయన వ్యర్థాలతో ట్యాంకర్ (ఏపి07 టీఎఫ్3677) రెండ్రోజులుగా నిలిపి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు పార్కింగ్ వెళ్లి ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సదరు ట్యాంకర్ గురించి ఆరా తీయగా దుండిగల్‌కు చెందిన ఓ వ్యక్తిగా గుర్తించి దుండిగల్‌లోని రాంకీకి తరలించారు. ట్యాంకర్‌కు సంబంధించి హన్మంత్ నాయక్, ప్రవీణ్‌నాయక్, డైవర్లు, శ్రీకాంత్, పవన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చెత్తను తరలించండి



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో పలు వీధుల్లో చెత్తను తరలించకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. జీవీపీ పాయింట్‌లు కూడా ఎత్తివేయడంతో ప్రతిరోజు జీహెచ్ఎంసీ సిబ్బంది వీధులలోని చెత్తను ఒక పాయింట్ వద్ద సమకూరిస్తే అక్కడి నుంచి ఎస్‌సీటీపీ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కోరుతున్నారు.